సాక్షి
విశాఖపట్నం
ఆదివారం । 21 । జనవరి । 2024



సరిహద్దుల్లో చెక్‌పోస్టులు

ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పోలీస్ శాఖ ముందుస్తు భద్రతా ఏర్పాట్లలో నిమగ్నమైంది. 8లో



ప్రశాంతంగా నవోదయ పరీక్ష

జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశానికి గానూ నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 8లో

బీచ్‌రోడ్డులో రాజ్ తరుణ్ సందడి



భీమిలి బీచ్ రోడ్డు మంగమారిపేట. తొట్లకొండ బీచ్ వద్ద శనివారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. 8లో

న్యూస్‌రీల్

27న విశాఖకు సీఎం

- భీమిలిలో భారీ బహిరంగ సభ ఏర్పాటు
- నేడు స్థలాలను పరిశీలించనున్న వైవీ సుబ్బారెడ్డి, తలశిల రఘురాం



విశాఖ సిటీ: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 27వ తేదీన విశాఖకు వస్తున్నట్లు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. ఉత్తరాంధ్ర నుంచి ఎన్నికల శంఖారావం పూరించేందుకు భీమిలిలో 27వ తేదీన భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సభను విజయవంతం చేసి ఎన్నికల శంఖారావానికి ఘన స్వాగతం పలుకుతామని చెప్పారు. ఈ సభకు అవసరమైన స్థలాల పరిశీలన కోసం వైఎస్సార్ కాంగ్రెస్ ప్రాంతీయ సమన్వయకర్త వై.వి.సుబ్బారెడ్డి, సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం ఆదివారం విశాఖకు వస్తున్నట్లు వెల్లడించారు. లక్షలాది మందితో చేపట్టే సభకు స్థలాలను పరిశీలించడంతో పాటు చేపట్టాల్సిన ఏర్పాట్లపై సమీక్షిస్తారని తెలిపారు.

10 మంది సీఐలకు స్థానచలనం



విశాఖ సిటీ: విశాఖ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 10 మంది ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం కలిగింది. సిటీ వీఆర్‌లో ఉన్న ఆరుగురికి పోస్టింగ్ ఇవ్వగా.. ఇద్దరిని బదిలీ చేశారు. అలాగే ఇతర జిల్లాల నుంచి రిపోర్ట్ చేయాల్సి ఉన్న ఇద్దరికి పోస్టింగ్‌లు ఇస్తూ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీకాకుళం నుంచి రిపోర్ట్ చేయాల్సి ఉన్న పి.శ్రీనివాసరావును మహారాణిపేట లా అండ్ ఆర్డర్‌కు, టి.సీతారామ్‌కు సౌత్ ట్రాఫిక్ సర్కిల్ సీఐగా పోస్టింగ్ కల్పించారు. అలాగే పెందుర్తి లా అండ్ ఆర్డర్ సీఐగా ఉన్న ఎం.శ్రీనివాసరావును ఆరిలోవ లా అండ్ ఆర్డర్‌కు, ఈస్ట్ సబ్ డివిజన్ క్రైమ్ సీఐ వి.చక్రధరరావును ఎయిర్‌పోర్ట్ లా అండ్ ఆర్డర్‌కు బదిలీ చేశారు. సిటీ వీఆర్‌లో ఉన్న ఎస్.సన్యాసినాయుడు మల్కాపురం లా అండ్ ఆర్డర్, సి.హెచ్.శ్రీనివాసరావు ద్వారకా సబ్ డివిజన్ క్రైమ్, ఎస్.అదాం సీసీఎస్-1, ఎస్.వేణుగోపాలరావు సీసీఎస్-2, ఎల్.రేవతమ్మ ఈస్ట్ ట్రాఫిక్-1, జి.శ్రీనివాసరావు వెస్ట్ ట్రాఫిక్ సర్కిల్ సీఐగా నియమించారు.

25 నుంచి ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సర్వీసులు



గోపాలపట్నం: హైదరాబాద్-విశాఖ-హైదరాబాద్ మధ్య ఈ నెల 25 నుంచి ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ నూతన సర్వీసులు ప్రారంభంకానున్నాయి. హైదరాబాద్‌లో సాయంత్రం 4.40 గంటలకు విమానం బయలుదేరి 6.05 గంటలకు విశాఖ చేరుకుంటుంది. సాయంత్రం 6.35 గంటలకు విశాఖలో తిరిగి బయలుదేరి రాత్రి 8 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది. మంగళవారం, గురువారం, శనివారం, ఆదివారం ఈ సర్వీసులు అందుబాటులో ఉంటాయి.

రేపు స్టీల్‌ప్లాంట్‌కు హాఫ్‌డే సెలవు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు సోమవారం హాఫ్‌డే సెలవు ప్రకటించారు. ఈ మేరకు యాజమాన్యం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. సోమవారం అయోధ్యలోని రామ మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వంగా అన్ని సంస్థలు, పరిశ్రమలకు హాఫ్‌డే సెలవు ప్రకటించింది. ఇందులో భాగంగా ఉద్యోగులు మధ్యాహ్నం 2.30 వరకు సెలవు తీసుకోవచ్చని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మరో నలుగురికి కరోనా

మహారాణిపేట: విశాఖలో మరో నలుగురికి కరోనా సోకింది. గడిచిన 24 గంటల్లో 66 మందికి పరీక్షలు చేయగా.. వీరిలో నలుగురికి కరోనా నిర్ధారణ అయింది. ముగ్గురు హోం ఐసోలేషన్‌లో, ఒకరు కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారని డీఎంహెచ్‌వో తెలిపారు.

సాధికారత దిశగా.. ‘సామాజిక’ గణన

- జిల్లాలో చురుగ్గా కుల గణన నిర్వహణ
- రెండు రోజుల్లో 86,003 గృహాల్లో సర్వే పూర్తి
- గణనలో రాష్ట్రంలోనే నంబర్ వన్‌గా విశాఖ జిల్లా

సాక్షి, విశాఖపట్నం : అణగారిన వర్గాల అభ్యున్నతికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఆర్థిక, సామాజిక సాధికారత దిశగా చేయూతనందించేందుకు ప్రారంభించిన సంపూర్ణ కులగణన ప్రక్రియ జిల్లాలో చురుగ్గా సాగుతోంది. బడుగు, బలహీన వర్గాల్లో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు, సంక్షేమాన్ని అందించడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న కులగణనలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. రెండు రోజుల్లో 12 శాతం సర్వే పూర్తి చేయడంలో రాష్ట్రంలో మొదటి స్థానంలో విశాఖ జిల్లా కొనసాగుతోంది. ఈ నెల 28 వరకు కులగణన సర్వే కొనసాగనుంది.

ప్రత్యేక యాప్‌లో..

కులగణన ప్రక్రియ ఈ నెల 19 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ప్రారంభించింది. ఈ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రత్యేక యాప్‌ని రూపొందించింది. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు వారి పరిధిలో ఉన్న ఇళ్లకు వెళ్లి ప్రతి ఒక్కరికి సంబంధించిన వివరాలను కులాల వారీగా సేకరించనున్నారు. దాదాపు 723 కులాల జాబితాలను ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల వారీగా వర్గీకరించి మొబైల్ యాప్‌కు అనుసంధానించారు. ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబం ఏ సామాజికవర్గ కేటగిరీ పరిధిలోకి వస్తుందో యాప్‌లో నిక్షిప్తం చేయగానే.. కులాల జాబితా వస్తుంది. దాని ప్రకారం కుటుంబ సభ్యులు చెప్పే వివరాల మేరకు కులగణన ప్రక్రియ నిర్వహిస్తున్నారు. వీటితో పాటు నో-క్యాస్ట్ కేటగిరీని కూడా కులగణన ప్రక్రియలో పొందుపరచడం విశేషం.



ఆర్డీవో హుస్సేన్‌సాహెబ్, పెందుర్తి తహసీల్దార్ శ్యామ్‌సుందర్ పర్యవేక్షణలో కులగణన నిర్వహిస్తున్న సచివాలయ సిబ్బంది



డీఎల్‌డీవో పూర్ణిమాదేవి పర్యవేక్షణలో కులగణన

జిల్లాలో 7,15,260 ఇళ్లల్లో సర్వే

జిల్లాలో చురుగ్గా కులగణన సర్వే మొదలైంది. జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ పర్యవేక్షణలో అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నారు. జిల్లాలో ఉన్న 607 సచివాలయాలను 12,408 క్లస్టర్లుగా విభజించి సర్వే నిర్వహిస్తున్నారు. కులగణనలో భాగంగా కుటుంబం నుంచి ఒక వ్యక్తి ఆధార్‌తో కూడిన ఈ-కేవైసీ తీసుకోనున్నారు. బయోమెట్రిక్, ఐరిష్ తదితర విధానాల ద్వారా గణన చేపడుతున్నారు. కేవలం రెండు రోజుల్లోనే 86,003 గృహాల్లో సర్వే పూర్తి చేశారు.

జోన్/ మండలం	సచివాలయాలు	క్లస్టర్లు	గృహాలు	కుటుంబ సభ్యులు	పూర్తయిన ఇళ్లు	కుటుంబ సభ్యులు
ఆనందపురం	18	383	21309	63860	5112	10610
భీమిలి	19	333	20877	62758	2975	6471
పద్మనాభం	16	337	17601	51117	3235	7124
పెందుర్తి	9	205	11780	34271	1880	3726
జోన్-1	15	347	18322	53429	4736	10336
జోన్-2	91	1812	96152	284618	9391	22596
జోన్-3	73	1805	91392	275343	11077	26235
జోన్-4	68	1179	70017	209980	11850	28849
జోన్-5	119	2531	139529	419164	13426	30637
జోన్-6	106	2077	142245	432423	10788	24189
జోన్-8	73	1399	86036	260544	11533	26189
మొత్తం	607	12408	715260	2147507	86003	197583

అందరూ సహకరించాలి



జిల్లాలో రెండు రోజులుగా కులగణన పక్కాగా నిర్వహిస్తున్నాం. ప్రతి ఇంటికీ వెళ్లి పూర్తిస్థాయిలో సామాజిక వర్గాల వారీగా వివరాలు సేకరిస్తున్నాం. గణన ప్రక్రియ జరుగుతున్న సమయంలో వివిధ కారణాలతో నమోదు చేసుకోకుండా మిగిలిపోయిన వారికి మరో అవకాశం కూడా ప్రభుత్వం కల్పిస్తోంది. ఈనెల 28తో గణన పూర్తవుతుంది. అనంతరం మిగిలిన వారికి 29 నుంచి ఫిబ్రవరి 2 వరకూ సచివాలయాలకు కుటుంబ సభ్యుల్లో ఎవరో ఒకరు వెళ్లి వివరాలు నమోదు చేసుకోవచ్చు. ప్రతి ఒక్కరూ ఈ బృహత్ ప్రక్రియకు సహకరించాలని కోరుతున్నాం.

– కె.ఎస్.విశ్వనాథన్, జాయింట్ కలెక్టర్

గణతంత్ర వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు

సమీక్షించిన జేసీ విశ్వనాథన్

మహారాణిపేట: గణతంత్ర వేడుకల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. గణతంత్ర వేడుకల సన్నాహక సమావేశం శనివారం కలెక్టరేట్ వీసీ హాలులో జరిగింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ తమకు అప్పగించిన బాధ్యతలను సమన్వయంతో నిర్వర్తించాలన్నారు. వేడుకలు నిర్వహించే మైదానాన్ని సిద్ధం చేయాలని, పరిశుభ్రత చర్యలు చేపట్టాలని పోలీస్, జీవీఎంసీ అధికారులకు సూచించారు. ప్రోటోకాల్ బాధ్యతలు, సీటింగ్ ఏర్పాట్లు చూసుకోవాలని ఆర్డీవోను ఆదేశించారు. సాంస్కృతిక ప్రదర్శనలు అద్భుతంగా సాగాలని, ఈ ఏడాది మరిన్ని విభిన్నమైన తెలుగు పాటలను ఎంపిక చేయాలని డీఈవోకు సూచించారు. నిరంతర విద్యుత్ సరఫరా, ప్రత్యామ్నాయంగా జనరేటర్లు సిద్ధం చేసుకోవాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి తెలియజేస్తూ స్టాళ్ల ఏర్పాటు చేయాలని, ఆయా శాఖల సాధించిన ప్రగతి నివేదికలను త్వరితగతిన పంపించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ ఏడాదిలో జిల్లా సాధించిన ప్రగతి విశేషాలను తెలియజేస్తూ శకటాలను ప్రదర్శించాలని, అందరూ సమన్వయంతో వేడుకలకు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. డీఆర్వో కె.మోహన్‌కుమార్, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ వై.శ్రీనివాసరావు, ప్రత్యేక ఉప కలెక్టర్ అఖిల, సీపీవో శ్రీనివాసరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి పి.జగదీశ్వరరావు, సమాచార పౌర సంబంధాల శాఖ ఉప సంచాలకుడు వి.మణిరామ్, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రామారావు, డీఈవో చంద్రకళ, సివిల్ సప్లై, ఐసీడీఎస్, జీవీఎంసీ, విద్యుత్ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్

రిపబ్లిక్ డే వేడుకలకు టి.నగరపాలెం సర్పంచ్

తగరపువలస: ఢిల్లీలో ఈ నెల 26న జరిగే రిపబ్లిక్ డే వేడుకలకు భీమిలి మండలం టి.నగరపాలెం పంచాయతీ సర్పంచ్ పాట్నూరు ఛాయాగౌతమికి ఆహ్వానం అందింది. రాష్ట్రానికి చెందిన 15 పంచాయతీల సర్పంచ్‌లకు 9 విభాగాల్లో ఎంపిక చేసి ఆహ్వానాలు అందజేయగా.. ‘మంచి పాలనతో పంచాయతీ’ విభాగంలో ఛాయా గౌతమికి ఈ అవకాశం దక్కింది. గతేడాది ఏప్రిల్ 24న జరిగిన జాతీయ పంచాయతీ దినోత్సవంలో ఇదే విభాగంలో ఆమెకు రాష్ట్రస్థాయి ఉత్తమ పంచాయతీ పురస్కారం లభించింది. ఈ వేడుకల్లో పాల్గొనేందుకు ఈ నెల 24న ఆమె న్యూఢిల్లీ బయలుదేరుతారు.



ఛాయాగౌతమి

ఆగడాలకు కళ్లెం.. మహిళలకు రక్షణ కవచం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్
- లైంగిక వేధింపుల నిరోధక చట్టం -2013పై అవగాహన

విశాఖ లీగల్: పనిచేసే ప్రదేశాల్లో మహిళలకు అన్ని విధాలుగా అండగా నిలవాలని, ఆహ్లాదకర, స్నేహపూర్వక వాతావరణంలో విధులు నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ అధికారులకు సూచించారు. మహిళలను కుటుంబ సభ్యుల్లా చూసుకోవాలని, వారి హక్కులకు ఎట్టి పరిస్థితుల్లోనే భంగం కలిగించేలా ఎవరూ వ్యవహరించరాదని హితవు పలికారు. పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం-2013పై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కోర్టు నూతన భవన సముదాయంలోని సమావేశ మందిరంలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన చట్టం ఉద్దేశాలు, మహిళలకు కల్పించిన రక్షణ చర్యలను వివరించారు. చట్టం గురించి అధికారులందరూ తెలుసుకోవాలని, పటిష్ఠంగా అమలు చేయాలని సూచించారు. ఆయా కార్యాలయాల పరిధిలో అవగాహన సదస్సులు నిర్వహించి.. ఈ చట్టం గురించి విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. అనంతరం పలువురు న్యాయ నిపుణులు తమ అభిప్రాయాలు, అనుభవాలను సదస్సులో పంచుకున్నారు. మెట్రో పాలిటిన్ సెషన్స్ జడ్జి ఎస్.శ్రీదేవి, కోర్టు రెండో అదనపు జడ్జి ఎం.వెంకటరమణ, ఇతర అదనపు న్యాయమూర్తులు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.వి.శేషమ్మ, సీనియర్ సివిల్ జడ్జిలు, పలువురు మెజిస్ట్రేట్లు, జిల్లా స్థాయి అధికారులు, కళాశాలల ప్రిన్సిపాళ్లు, న్యాయవాదులు, కోర్టు అధికారులు పాల్గొన్నారు.

ఆచార్య ప్రసాదరెడ్డికి అపూర్వ స్వాగతం



ఎన్‌సీసీ విద్యార్థుల గౌరవ వందనం స్వీకరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి



వీసీ ప్రసాద్‌రెడ్డికి అభినందనలు చెబుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో శనివారం పండగ వాతావరణం నెలకొంది. ఏయూ ఉపకులపతిగా ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి రెండోసారి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా పరిపాలన భవనం వద్ద సందడి కనిపించింది. స్థానిక విద్యార్థులతో పాటు వివిధ దేశాలకు చెందిన విద్యార్థులు అధిక సంఖ్యలో తరలివచ్చి.. అపూర్వ రీతిలో ఆయనకు స్వాగతం పలికారు. తమ అభ్యున్నతికి విశేష కృషి చేసిన ఆచార్య ప్రసాదరెడ్డిని వీసీగా రెండో పర్యాయం నియమించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ.. థ్యాంక్యూ సీఎం.. వుయ్ లవ్ వీసీ సార్ అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. బంగ్లాదేశ్, ఇండోనేషియా, సూడాన్, మాలి, ఇరాన్, టాగో తదితర దేశాలకు చెందిన విద్యార్థులు తమ దేశ సంప్రదాయ వస్త్రధారణలో విచ్చేసి వీసీని స్వాగతించారు. వీసీ ప్రతీ విద్యార్థిని ఆప్యాయంగా పలకరించారు. అనంతరం ఎన్‌సీసీ విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. వర్సిటీ వ్యవస్థాపక ఉపకులపతి కట్టమంచి రామలింగారెడ్డి విగ్రహానికి రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఎం.జేమ్స్ స్టీఫెన్‌లతో కలిసి పుష్పాలను అర్పించారు. మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్, జ్యోతిబా పూలే, బాబూ జగ్జీవన్‌రామ్, మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వీసీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వేద పండితులు ఆయనకు ఆశీర్వచనం అందించారు. విద్యార్థులు, ఉద్యోగులు, వర్సిటీ అనుబంధ కళాశాలల అధ్యాపకులతో పాటు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ జాన్ వెస్లీ, ప్రముఖ ఆడిటర్ జీవీ, మాజీ ఎమ్మెల్యే చింతల పూడి వెంకటరామయ్య, పిన్నింటి వరలక్ష్మి, కొల్లు సింహాచలం, వైఎస్సార్ సీపీ సాంస్కృతిక విభాగం రీజినల్ కో-ఆర్డినేటర్ వంకాయల మారుతీప్రసాద్, డి.రామకృష్ణారెడ్డి, పలువురు కార్పొరేటర్లు, నాయకులు వీసీకి పుష్పగుచ్ఛాలు అందించి.. శుభాకాంక్షలు తెలిపారు.

గ్రేసీ మృతికి పోలీసుల సంతాపం

విశాఖ సిటీ: పోలీస్ శాఖలో ఎనిమిదేళ్ల పాటు సేవలు అందించి శనివారం మృతి చెందిన పోలీస్ జాగిలం గ్రేసీకి పోలీస్ అధికారులు, సిబ్బంది నివాళులు అర్పించారు. లేబ్రోడర్ రిట్రైవర్ జాతికి చెందిన గ్రేసీ 2016 నుంచి 2024 వరకు ఎక్స్‌ప్లోజివ్ ట్రేడ్‌కి సంబంధించి సేవలు అందించింది. గ్రేసీ మృతి పట్ల ఏసీపీ-1(ఏఆర్) ఐ.మోహన్ కుమార్, ఏసీపీ-2(ఏఆర్) ఎ.రాఘవేంద్రరావు, ఆర్ఐ(సీఎస్‌డబ్ల్యూ) రవికుమార్, డాగ్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొని సంతాపం తెలిపారు.



గ్రేసీకి నివాళులు అర్పిస్తున్న పోలీస్ అధికారులు

సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి

డాబాగార్డెన్స్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక దృష్టి సారించాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ అధికారులను ఆదేశించారు. తన చాంబర్‌లో శనివారం జీవీఎంసీ ప్రజారోగ్య అధికారులు, జిల్లా మలేరియా అధికారితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇటీవల పారిశుద్ధ్య కార్మికుల సమ్మె కారణంగా దోమలు ఎక్కువగా వృద్ధి చెంది, డెంగ్యూ ప్రబలే అవకాశం ఉన్నందున.. నియంత్రణకు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. నగరంలో 2021-22లో 53 డెంగ్యూ కేసులు నమోదు కాగా, 2022-23లో 56, 2023-24లో ఇప్పటివరకు 26 డెంగ్యూ కేసులు మాత్రమే నమోదయ్యాయన్నారు. ఈ ఏడాది ప్రజల్లో సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టినందున డెంగ్యూ కేసులు తగ్గాయని చెప్పారు. జీవీఎంసీ పరిధిలో 726 మంది మలేరియా సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని, అందులో 200 మంది కార్మికులను ఏఎల్ఓ యాక్టివిటీ, స్ప్రేయింగ్, ఫాగింగ్ వంటి కార్యక్రమాలకు ఉపయోగిస్తున్నామన్నారు. అదనంగా తాత్కాలిక పద్ధతిన 399 మంది మలేరియా సిబ్బందిని తీసుకున్నట్లు చెప్పారు. దోమలు వృద్ధి చెందకుండా అన్ని వార్డుల్లో ఆయిల్ బాల్స్ స్ప్రేయింగ్, ఫాగింగ్ కార్యక్రమాలతోపాటు వార్డు వలంటీర్లు, ఏఎన్ఎంలు, మలేరియా సిబ్బంది ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. దోమల వృద్ధిని అరికట్టేందుకు నగరంలోని చెరువులు, నీటి గుంటల్లో మరో 5 లక్షల చేపలు విడుదల చేస్తామని పేర్కొన్నారు. అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, బయాలజిస్ట్ సాంబమూర్తి పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

● జీవన సాఫల్య పురస్కారాల ప్రదానం







ఇండ్ల రామసుబ్బారెడ్డి, విల్సన్ సుధాకర్, రాధాకృష్ణంరాజు దంపతులకు పురస్కారాలు అందిస్తున్న చిరంజీవి

సాక్షి, విశాఖపట్నం : ఎన్టీఆర్ 28వ పుణ్యతిథి, ఏఎన్నార్ శతజయంతి ఉత్సవాలతో పాటు లోక్‌నాయక్ ఫౌండేషన్ 20వ వార్షిక పురస్కారాల ప్రదానోత్సవం సంస్థ వ్యవస్థాపకుడు ప్రొ.యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ ఆధ్వర్యంలో రుషికొండలో శనివారం నిర్వహించారు. ప్రముఖ నవలా రచయిత యండమూరి వీరేంద్రనాథ్‌కు సాహిత్య పురస్కారాన్ని ముఖ్య అతిథి చిరంజీవి చేతుల మీదుగా ప్రదానం చేశారు. ప్రముఖ మనో వైద్యులు డా.ఇండ్ల రామసుబ్బారెడ్డి, అంతర్జాతీయ పర్యాటక శాఖ నిపుణులు విల్సన్ సుధాకర్ తుల్లిమిల్లి, బెంగళూరు తెలుగు సమాఖ్య అధ్యక్షుడు రాధాకృష్ణంరాజుకి జీవన సాఫల్య పురస్కారాలు అందజేశారు.

రహదారి భద్రత.. అందరి బాధ్యత

జేసీ విశ్వనాథన్



బైక్ ర్యాలీ ప్రారంభిస్తున్న జేసీ విశ్వనాథన్

బీచ్‌రోడ్డు: అన్ని శాఖల సమన్వయంతో పాటు ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించినప్పుడే రోడ్డు ప్రమాదాల నియంత్రణ సాధ్యమవుతుందని జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ అన్నారు. ఆర్.కె.బీచ్‌లోని కాళీమాత ఆలయం వద్ద శనివారం బైక్ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అంతకుముందు జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భద్రత నియమావళిపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించడమే లక్ష్యంగా మాసోత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. రోడ్డు ప్రమాదాలను నియంత్రించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. అధిక వేగం వల్ల ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని, వాహనాలు నడిపేటప్పుడు అందరూ జాగ్రత్త వహించాలన్నారు. రవాణా శాఖ జాయింట్ కమిషనర్ వడ్డి సుందర్ మాట్లాడుతూ రోడ్డుపై ప్రయాణించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. సీటు బెల్టు, హెల్మెట్ ధరించడంలో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్ యంత్రాంగం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయని తెలిపారు. అనంతరం మాసోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను జేసీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉప రవాణా అధికారి రాజారత్నం, ట్రాఫిక్ ఏడీసీపీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బీచ్‌రోడ్డులో రాజ్ తరుణ్ సందడి

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు మంగమారిపేట, తొట్లకొండ బీచ్ వద్ద శనివారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. నటుడు రాజ్ తరుణ్, నటి మనీషా కందూర్ నటిస్తున్న భలే ఉన్నాడే సినిమాకు సంబంధించిన పలు సన్నివేశాలను చిత్రీకరించారు. రవికిరణ్ ఆర్ట్స్ పతాకంపై ఎన్వీ కిరణ్ కుమార్ నిర్మిస్తున్న ఈ సినిమా రొమాంటిక్ లవ్ ఎంటర్‌టైన్‌మెంట్‌గా తెరకెక్కుతోందని, హీరో రాజ్ తరుణ్ న్యూలుక్‌లో కనిపించబోతున్నారని దర్శకుడు జె. శివసాయి వర్ధన్ తెలిపారు. ఈ సినిమాలో సింగీతం శ్రీనివాస్ ప్రముఖ పాత్రలో నటించగా, అమ్ము అభి (నారప్ప ఫేమ్), కృష్ణ భగవాన్, హైపర్ ఆది ఇతర పాత్రలో నటిస్తున్నారన్నారు. సంగీతం శేఖర్ చంద్ర అందిస్తున్నారు. మరో 8 రోజుల పాటు బీచ్‌రోడ్డు ప్రాంతాల్లో చిత్రీకరణ ఉంటుందన్నారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

కొమ్మాది : జవహర్ నవోదయ విద్యాలయంలో వచ్చే విద్యా సంవత్సరంలో 6వ తరగతి ప్రవేశానికి గాను శనివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ప్రిన్సిపాల్ కె.సంజయ్ తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 44 కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షకు 6,021 మంది విద్యార్థులు హాజరయ్యారని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో 8,107 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 2,086 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

సరిహద్దుల్లో చెక్‌పోస్టులు

విశాఖ సిటీ: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పోలీస్ శాఖ ముందస్తు భద్రతా ఏర్పాట్లలో నిమగ్నమైంది. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు, నగదు తరలింపు, అక్రమ మద్యాన్ని నియంత్రణపై దృష్టి సారించింది. నగరంలోకి వచ్చే సరిహద్దు ప్రాంతాలైన పద్మనాభం వద్ద చిన్నాపురం జంక్షన్, ఆనందపురం పరిధిలో భీమిలి క్రాస్ రోడ్, గోపాలపట్నం పరిధిలో అడవివరం, దువ్వాడ పరిధిలో అగనంపూడి, పెందుర్తి పరిధిలో సరిపల్లి ప్రాంతాల్లో ప్రత్యేక చెక్ పోస్టులు ఏర్పాటుచేసింది. ఈ చెక్‌పోస్టులను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెక్‌పోస్టుల పనితీరు, అక్కడ వసతులను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అక్రమ మద్యం, నగదు, ఇతర అనుమానిత వస్తువులను పూర్తిగా నివారించేలా అన్ని వాహనాలను నిరంతరం తనిఖీలు నిర్వహించాలని చెప్పారు.

మార్కెట్లోకి కొత్త హ్యుందాయ్ క్రెటా



విశాఖ సిటీ: విశాఖలో మార్కెట్‌లోకి కొత్త హ్యుందాయ్ క్రెటా కార్ అడుగుపెట్టింది. నగరంలో అతిపెద్ద ఆటోమొబైల్ డీలర్ లక్ష్మీ హ్యుందాయ్ షోరూంలో సీఈఓ డాక్టర్ వి.శ్రీనివాస్, జీఎం(ఏ అండ్ ఎఫ్) జి.కిషోర్‌కుమార్ సమక్షంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం పంకజ్‌కుమార్ కొత్త హ్యుందాయ్ క్రెటా కార్‌ను ప్రారంభించారు. అద్భుతమైన డిజైన్, అత్యాధునిక సాంకేతికత, పూర్తి సౌకర్యవంతంగా ఉండే ఈ క్రెటా ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటుందని లక్ష్మీ హ్యుందాయ్ సీఈఓ డాక్టర్ వి.శ్రీనివాస్ పేర్కొన్నారు. హ్యుందాయ్ క్రెటా దేశానికి ఇష్టమైన బ్రాండ్ అని, 9 లక్షల మంది కస్టమర్లను ఆకర్షించిందని తెలిపారు. కొత్త క్రెటా అధునాతన స్థాయి 2 అడాస్ సేఫ్టీ సూట్, శక్తివంతమైన 1.5 లీటర్ టర్బో జీడీఐ ఇంజన్, యాక్టివ్ అండ్ పాసివ్, ఇలా అనేక ఫీచర్లతో దేశంలో ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో అగ్రగామిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు మరో అవకాశం

విశాఖ విద్య: సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించే పదో తరగతి, ఇంటర్మీడియెట్ ప్రవేశాలకు మరో అవకాశం కల్పించినట్లు డీఈవో ఎల్.చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, జిల్లాలోని ఓపెన్ విద్య స్టడీ సెంటర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు. కోర్సు ప్రవేశ ఫీజుతో పాటు, రూ.1000లు అదనపు రుసుముగా చెల్లించాల్సి ఉంటుందన్నారు.